# కూచిమంచి జగ్గకవి "చంద్రరేఖా విలాపము"

## పరిచయం

కూచిమంచి జగ్గకవి పద్దెనిమిదో శతాబ్దపు తొలిభాగంలో పిఠాపురం ప్రాంతంలో ఉన్నవాడు. ఇతని అన్న కూచిమంచి తిమ్మకవి కూడ సుప్రసిద్ధుడే. ఆ జగ్గకవి రాసిన "హాస్యరసప్రబంధం" ఇది. పచ్చిబూతులబుంగ, అశ్లీలభాషా భూయిష్ఠం, అసభ్యపద పూరితం, అని ఈ కావ్యాన్ని ఇరవైయో శతాబ్ది తొలిభాగంలో ప్రభుత్వం నిషేధించింది. ఆ నిషేధం ఇప్పటికీ అమల్లో ఉంది!

ఈ కావ్యాన్ని 1922 లో "కామ గ్రంథమాల" వారు పుదుచ్చేరి నుంచి ప్రచురించారు. ఈ కామ గ్రంథమాల సంపాదకులు యస్. చిన్నయ్య గారు. 1922 అక్టోబర్‌లో ఇది బయటకు వచ్చింది. తర్వాత దీన్ని మళ్ళీ ఎవరూ ప్రచురించలేదు.

తెలుగులో ఒక విశిష్టమైన కావ్యం ఇది. ప్రబంధ సాహిత్యం మనుచరిత్రతో మొదలై, ఓ యాభై యేళ్ళ లోపే వసుచరిత్రతో ఉన్నతశిఖరాలని అధిరోహించాక, ఆ తర్వాత వచ్చిన ప్రతిభావంతులు కొత్త దారుల కోసం వెదికారు (వసుచరిత్రకారుడికి సమకాలీనుడైన పింగళి సూరన తనదైన ఒక వినూత్న మార్గాన్ని వసుచరిత్ర రావటానికి ముందే వేసుకున్నాడు కూడ). రకరకాల చిత్రకవిత్వాలు, కొత్త రకాలైన వస్తువుతో సరికొత్త ప్రబంధాలు, నాటకాలు, యక్షగానాలు, పదాలు, ఇలా ఎన్నో విధాలైన ప్రయోగాలు వచ్చాయి. వీటిలో ఎన్నో హాస్య రస పూరితమైన రచనలు ఉన్నాయి ("సతిదాన శూరం" ఓ మంచి ఉదాహరణ).

రచనా పద్ధతి కొంతవరకు ప్రబంధాల దారిలోనే నడుస్తున్నా, ప్రబంధ భాషా, వర్ణనా సంప్రదాయాల్ని ఛిన్నాభిన్నం చేసిన "హాస్య రస ప్రబంధం" ఈ చంద్రరేఖా విలాపం. దీన్లోనే కవి వివరించిన ప్రకారం ఈ కావ్యానికి అంకురార్పణ ఎలా జరిగిందంటే – మొదట తను సంప్రదాయ పద్ధతిలో రాసిన ప్రబంధాన్ని (ఈ ప్రబంధం ఏమిటో, ఏమయ్యిందో మనకు తెలీదు) అంకితం తీసుకుంటానని వాగ్దానం చేసి, తీరా దాన్ని సిద్ధం చేసి తీసుకువెళ్ళే సరికి చేతిలో డబ్బులు లేవని, ఆ కావ్యాన్ని తను కొనలేనని నేలచూపులు చూస్తూ చెప్పాడు చింతలపాటి నీలాద్రిరాజు. అంతేకాకుండా, అలాటి ప్రబంధాలు అప్పటికే కొల్లలుగా వచ్చాయి గనుక వాటివల్ల ఏమీ ఉపయోగం కలగటం లేదనీ, డబ్బు ఖర్చు

లేకుండా తన గురించి, తను ఉంచుకున్న వేశ్య చంద్రరేఖ గురించి, ఓ హాస్యప్రబంధం రాయమని సలహా కూడ పడేశాడు. అంతకుముందే ఆడిమళ్ళ వేంకట శాస్త్రులు అతనికి ఒక సంస్కృత అలంకార గ్రంథం అంకితం ఇచ్చాడు. చంద్రరేఖ ఆ వేంకటశాస్త్రులు ఉంచుకున్న వేశ్య కటకపు వేంకటసాని కూతురు. బహుశా వీటన్నిటి కారణంగా జగ్గకవి, తనకు నీలాద్రిరాజు డబ్బివ్వకపోవటానికి ముఖ్యకారకుడు ఆ వేంకటశాస్త్రే నని నమ్మినట్టు కనపడుతుంది.

మొత్తానికి నీలాద్రిరాజునీ, చంద్రరేఖనీ, వేంకటశాస్త్రుల్నీ, వేంకటసానినీ కలగలిపి చండాలంగా బండబూతులు తిడుతూ జగ్గకవి రాసిన "హాస్యప్రబంధం" ఇది.

ఐతే, దీని పుట్టుకకు కారణాలేవైనా ఇదొక అద్భుతమైన కావ్యం. తన వస్తువు కోసం ఇతను సృష్టించిన కవిసమయాలు, ఉపమానాలు, భాష, ప్రయోగాలు కళ్ళు మిరుమిట్లు గొలుపుతాయి. ఇతని వర్ణనల తీరు, సృష్టించిన సంఘటనలు, కడుపుబ్బ నవ్వించక మానవు (అక్కడక్కడ జుగుప్సనీ అసహ్యాన్నీ కూడ).

అంతేకాదు, అనేక ప్రముఖ పద్యాలకు పేరడీలు కూడ కనిపిస్తాయిందులో (ముఖ్యంగా భాగవతంలోని గోపికాగీతలకూ, తిక్కన గారి "హా యను .." అనే పద్యానికీ అనుసరణల్ని తప్పకుండా గమనించండి).

# హెచ్చరిక

పచ్చిబూతులు విచ్చలవిడిగా వున్నాయీ కావ్యంలో. అలాటివి మీకు నచ్చనివైతే దయచేసి దీన్ని చదవకండి.

పద్దెనిమిదేళ్ళ లోపు వయసు వారు దీన్ని చదవకూడదు.

| Part 1 | html | pdf |
|---|---|---|

| | | |
|---|---|---|
| Part 2 | html | pdf |
| Part 3 | html | pdf |